
# పోతనభాగవతంలో రసగుళికలు

## – ఆర్.శర్మ దంతుర్తి



## 95 వ భాగం

# లోకాల సృష్టి, భగవంతుడి స్వరూపం

క్రితం వ్యాసంలో బ్రహ్మ నారదుడితో సృష్టి ఎలా జరుగుతుందో చెప్పడం మొదలుపెట్టాడని చదివాం. దాని మీద మరింత వివరణ ఇస్తున్నాడిప్పుడు. ఈ వచనం జాగ్రత్తగా చదవండి. ఇందులో అనేక అర్ధంకాని విషయాలు మెల్లిగా చదివితే కానీ పట్టుబడవు. అసలు మనం జన్మించడానికీ, మృత్యువాత పడడానికీ మళ్ళీ జన్మించడానికీ కారణం ఏమిటి? ఒకసారి జన్మ ధరించాక ఏమౌతోంది? అంతా భగవంతుడే అయితే మనకి అంటుకున్న మూడు గుణాలూ ఆయనకు ఎందుకు లేవు? వీటికి సమాధానం ఇందులో ఉంది.

వ. మఱియు దేహంబునకు ద్రవ్యంబులైన మహాభూతంబులును జన్మనిమిత్తంబులైన కర్మంబులునుఁ, గర్మక్షోభకంబైన కాలంబునుఁ, గాలపరిణామ హేతువైన స్వభావంబును, భోక్త యైన జీవుండును, వాసుదేవుండ కా నెఱుంగుము; వాసుదేవ వ్యతిరిక్తంబు లేదు; సిద్ధంబు నారాయణ నియమ్యంబులు లోకంబులు దేవతలు నారాయణశరీరసంభూతులు; వేద యాగ తపోయోగ విజ్ఞానంబులు నారాయణ పరంబులు జ్ఞానసాధ్యం బగు ఫలంబు నారాయణు నధీనంబు; కూటస్థుండును సర్వాత్మకుండును సర్వద్రష్టయు నయిన యీశ్వరుని కటాక్ష విశేషంబున సృజియింపంబడి ప్రేరితుండనై సృజ్యంబైన ప్రపంచంబు సృజించుచుండుదు; నిర్గుణుండైన యీశ్వరుని వలన రజస్సత్త్వతమోగుణంబులు ప్రభూతంబులై యుత్పత్తి స్థితిలయంబులకుం బాలుపడి కార్య కారణ కర్తృత్వ భావంబు లందు ద్రవ్యంబులైన మహాభూతంబులును జ్ఞానమూర్తు లయిన దేవతలును గ్రియారూపంబు లయిన యింద్రియంబులును నాశ్రయంబులుగా నిత్యముక్తుం డయ్యును మాయాసమన్వితుండైన జీవుని బంధించు; జీవునకు నావరణంబులయి యుపాధిభూతంబు లయిన మూఁడు లింగంబులు సేసి పరులకు లక్షితంబుగాక తనకు లక్షితంబైన తత్త్వంబుగల యీశ్వరుం డివ్విధంబున గ్రీడించుచుండు.

[2-84]

శరీరానికి కారణం పంచభూతాలు కదా? ఇవి మహాభూతాలు. వీటితో కలిసి కర్మ, ఆ కర్మకి హేతువు ఎవరికీ అంతుపట్టనిది మహాప్రవాహమైన కాలం. ఈ కర్మ అనుభవించే జీవులన్నీ కూడా ఆ భగవంతుడి అంశ తప్ప వేరే ఏమీ లేదు (వాసుదేవ వ్యతిరిక్తంబు లేదు). వేదం, యాగం, తపస్సు, యోగం, జ్ఞాన, విజ్ఞానాలు భగవంతుడి అధీనంలోనివే. అందర్నీ సమంగా చూసే భగవంతుడి క్రీగంటి చూపు వల్లే ఏ గుణానికి అందని పరమేశ్వరుడి నుండి సత్వ, తమో, రజో గుణాలు పుడుతున్నాయి. ఈ త్రిగుణాలే ఉత్పత్తి, స్థితి లయాలకి కారణాలు. జీవుడు భగవంతుడి అంశ అయినా మాయ వల్ల త్రిగుణాలచే బంధించబడి తానెవరో తెలుసుకోలేకపోతున్నాడు. ఈ గుణాలని సృజించిన భగవంతుడు వాటి మాయతో జీవులని కప్పేసి వాళ్లకి కనబడకుండా, తనకు మాత్రం కనిపించే తత్వంతో ఈ విశ్వాన్ని వినోదంగా చూస్తూంటాడు. ఇదంతా ఆయనకో క్రీడ. అయితే త్రిగుణాలకి అతీతుడైనా, కావాల్సినపుడు ఆ గుణాలతో కూడి తాను కూడా ఒక జీవి రూపులో కనబడుతూ ఉంటాడు. ఈ లోకాలన్నీ ఎలా ఏర్పడ్డాయి అనేది ఇప్పుడు చెప్పబోతున్నాడు.

క. భువనాత్మకుఁ డా యీశుఁడు
భవనాకృతితోడ నుండు బ్రహ్మాండంబున్
వివరముతోఁ బదునాలుఁగు
వివరంబులుగా నొనర్చె విశదంబులుగన్ [2-87]

భువనాత్మకుడైన (త్రిభువనాలకీ మూలమైనవాడు) ఈశ్వరుడు, భవనంలాగా ఉండే ఈ బ్రహ్మాండాన్ని వివరంగా పద్నాలుగు లోకాలలుగా విభజించాడు. ఆ లోకాలు ఎలా ఉంటాయంటే,

మ. బహు పా దోరు భు జాన నేక్షణ శిరఃఫాలశ్రవోయుక్తుఁడై
విహరించున్ బహుదేహి దేహగతుఁడై; విద్వాంసు లూహించి త
ద్బహురూపావయవంబులన్ భువనసంపత్తిన్ విచారింతు; రా
మహనీయాద్భుతమూర్తి యోగిజన హృన్మాన్యుండు మేధానిధీ! [2-88]

ఆ భగవంతుడు అనేక పాదాలు, అవయవాలు నేత్రాలూ శిరస్సులూ కలిగి, అనేక శరీరాల్లో ఉంటాడు. అంటే రకరకాలైన ప్రాణులన్నింటిలోనూ ఉంటాడన్నమాట. ఇదంతా తెల్సిన విద్వాంసులు ఆ మహనీయమైన అద్భుత మూర్తిని సమస్త భువనాల్లో ఉన్నాడని తెలుసుకుంటూ ఉంటారు. ఈ భగవంతుడే యోగుల హృదయంలో ఉండేది.

వ. వినుము; చతుర్దశ లోకంబులందు మీఁది యేడు లోకంబులు శ్రీమహావిష్ణువునకుం గటి ప్రదేశంబున నుండి యూర్ధ్వదేహమనియునుఁ, గ్రింది యేడు లోకంబులు జఘనంబునుండి యధోదేహ మనియునుం, బలుకుదురు; --- --- --- భూలోకంబు గటిప్రదేశంబు; భువర్లోకంబు నాభి; సువర్లోకంబు హృదయంబు; మహర్లోకంబు వక్షంబు; జనలోకంబు గ్రీవంబు; తపోలోకంబు స్తనద్వయంబు; సనాతనంబును బ్రహ్మనివాసంబునునైన సత్య లోకంబు శిరంబు; జఘనప్రదేశం బతలంబు; తొడలు విత లంబు; జానువులు సుతలంబు; జంఘలు తలాతలంబు; గుల్ఫంబులు మహాతలంబు; పాదాగ్రంబులు రసాతలంబు; పాదతలంబు పాతాళంబు నని లోకమయుంగా భావింతురు; కొందఱు మఱియుం బాదతలంబువలన భూలోకంబును నాభివలన భువర్లోకంబును; శిరంబున స్వర్లోకంబును; గలిగె నని లోకకల్పనంబు నెన్నుదురు; --- --- --- మనోవ్యాపారరూపంబగు లింగశరీరంబునకు మహామహిముని హృదయంబు సర్గభూమి యగు మఱియును. [2-89]

పధ్నాలుగు లోకాలు ఎక్కడ ఎలా ఉన్నాయో చెప్తున్నాడిప్పుడు. విశ్వం అంతా ఒక శరీరాకృతి కలిసిన పధ్నాలుగు లోకాలనుకుంటే, భగవంతుడి నడుము నుండి పై శరీరంలో ఉండేవి ఊర్ధ్వ లోకాలు. కిందివి అధోలోకాలు. ఇదే రాజయోగంలో చెప్పే చక్రాల వివరణ కూడా. మూలాధారం నుండి సహస్రారం దాకా ఉండేవి ఊర్ధ్వలోకాలు. ఈ ప్రపంచం అంతా భగవంతుడి శరీరం. కటిస్థలి భూలోకం, నాభి భువర్లోకం; హృదయం సువర్లోకం. వక్షం మహర్లోకం. కంఠం (గ్రీవం) జనోలోకం; స్థనాలు తపోలోకం; విష్ణువునాభిలోంచి పుట్టిన బ్రహ్మ ఉండేది శిరస్సులోని సత్యలోకం. అలాగే కటిప్రదేశం నుంచి కిందికి అధోలోకాలు, ఇందులో చివరది పాదాలలో ఉండే పాతాళం. అలా చెప్పుకుంటూ పోతే జన్మాలకీ, సముద్రాలకీ, భూతాల విలయానికీ ఆయన ఉదరం ఉనికిపట్టు. మనోవ్యాపారానికి భగవంతుడి హృదయమే సృష్టి స్థానం.

ఆ. నీలకంధరునకు నీకు నాకు సనత్కు
మార ముఖ్య సుతసమాజమునకు
ధర్మ సత్త్వ బుద్ధి తత్త్వములకు నీశ్వ
రాత్మ వినుము పరమమైన నెలవు. [2-90]

నీలకంఠుడైన శివుడికి, నీకు, నాకు, సనక సనందాదులతో సహా ధర్మానికీ, సత్త్వ, బుద్ధి, తత్వానికీ, విజ్ఞానానికీ కూడా ఈ భగవంతుడి ఆత్మే మూలకారణం.

సీ. నర సురాసుర పితృ నాగ కుంజర మృగ
గంధర్వ యక్ష రాక్షస మహీజ
సిద్ధ విద్యాధర జీమూత చారణ
గ్రహ తారకాప్సరోగణ విహంగ
భూత తటిద్వస్తు పుంజంబులును నీవు
ముక్కంటియును మహామునులు నేను
సలిలనభస్థ్సలచరములు మొదలైన
వివిధ జీవులతోడి విశ్వమెల్ల [2-91]

ఆ. విష్ణుమయము పుత్ర! వేయేల బ్రహ్మాండ
మతని జేనలోన నడఁగి యుండు;
బుద్ధి నెఱుఁగరాదు భూతభవద్భవ్య
లోకమెల్ల విష్ణులోన నుండు. [2-91.1]

ఇంతకు ముందు చెప్పినదే మరోసారి చెప్తున్నాడు – మానవ, దేవ, దానవ, పితృ, నాగ, గజ (కుంజర), మృగ, గంధర్వ యక్ష, రాక్షస, వృక్ష (మహీజ) తో అందరూ కలిపి, గ్రహ, నక్షత్ర, అప్సర, పక్షులు, ముక్కంటి, నువ్వూ నేనూ, మహర్షులు, అలా అంతా కూడా ఈ భగవంతుడి చైతన్యమే. అన్ని మాటలెందుకు కానీ విశ్వం అంతా విష్ణుమయం. మరో విశేషం ఏమిటంటే, ఇప్పుడున్నవి, రాబోయేవి, గడచిన విషయాలు అన్నీ కూడా భగవంతుడి అంశమే. ఈ లోకాలన్నీ కూడా భగవంతుడి అరచేతిలో (జేనలోన, పన్నెండు అంగుళాలలో) ఇమిడిపోతాయి. ఈ విషయం ఎటువంటిదంటే,

క. మండలములోన భాస్కరుఁ
డుండి జగంబులకు దీప్తి నొసఁగెడి క్రియ బ్ర
హ్మాండములోపల నచ్యుతుఁ
డుండుచు బహిరంతరముల నొగి వెలిఁగించున్. [2-92]

తారామండలంలో ఉన్న సూర్యుడు లోకాలకి కాంతి ఇస్తున్నాడు కదా తానున్న చోటులో అక్కడ్నుంచే? అలాగే భగవంతుడు బ్రహ్మాండంలో ఉండి లోపలా బయటా అన్నింటినీ ప్రకాశింపచేస్తున్నాడు.

ఉ. అట్టి యనంతశక్తి జగదాత్ముని నాభిసరోజమందుఁ నేఁ
బుట్టి యజింపఁగా మనసు పుట్టిన యజ్ఞపదార్థజాతముల్
నెట్టన కానరామికి వినిర్మల మైన తదీయ రూపమున్
గట్టిగ బుద్ధిలో నిలిపి కంటి నుపాయము నా మనంబునన్. [2-93]

అనంతమైన శక్తి ఉన్న భగవంతుడి నాభిలో ఉన్న పద్మంలోంచి నేను పుట్టాను. నా మనసులో యజ్ఞం చేయాలనే కోరిక పుట్టింది. కానీ దానికి అవసరమైనవేవీ కనపడలేదు. అప్పుడు భగవంతుడి స్వరూపాన్నే ధ్యానించే సరికి బుద్దిలో ఒక ఉపాయం తోచింది. గమనించండి, ఇదే కృష్ణుడు చెప్పిన 'యజ్ఞానాం జపయజ్ఞోస్మి' అనేది. ఇప్పుడు చెప్తున్నాడు అసలు యజ్ఞం అంటే ఏమిటో.

సీ. పశు యజ్ఞ వాట యూపస్తంభ పాత్ర మృ
ద్ఘట శరావ వసంత కాలములును
స్నేహౌషధీ బహు లోహ చాతుర్హోత్ర
మత నామధేయ సన్మంత్రములును
సంకల్ప ఋగ్యజుస్సామ నియుక్త వ
షట్కారమంత్రానుచరణములును
దక్షిణల్ దేవతాధ్యాన తదనుగత
తంత్ర వ్రతోద్దేశ ధరణిసురులు [2-94]

తే. నర్పణంబులు బోధాయనాది కర్మ
సరణి మొదలగు యజ్ఞోపకరణసమితి
యంతయును నమ్మహాత్ముని యవయవములు
గాఁగఁ గల్పించి విధివత్ప్రకారమునను. [2-94.1]

యజ్ఞానికి కావాల్సిన మంత్రాలు, సంకల్పం, యూపస్థంభం, పాత్రలు అన్నీ కూడా భగవంతుడి అవతారాలుగా సంకల్పించి విధి అనుసరించాను. మనసు భగవంతుడి మీద ఉండాలి కానీ మిగతావి అంత ముఖ్యం కాదు కదా? అదే బ్రహ్మ చేసినది – అంటే తపస్సు చేశాడు తనని పుట్టించినదెవరా అని ఆలోచిస్తూ. ఇదే రమణుల సిద్ధాంతం. నేనెవరిని ఎలా ఇక్కడకి వచ్చాను, వగైరా, లేదా తనని తాను తెలుసుకోవడం. ఇలా చేసాక ఏమైంది?

క. యజ్ఞాంగి యజ్ఞఫలదుఁడు
యజ్ఞేశుఁడు యజ్ఞకర్తయగు భగవంతున్
యజ్ఞపురుషుఁగా మానస
యజ్ఞముఁ గావించితిం దదర్పణ బుద్ధిన్. [2-95]

యజ్ఞమే శరీరమైనవాడు, యజ్ఞానికి ఫలితం ఇచేవాడు, యజ్ఞానికి ప్రభువు, కర్తా అయిన భగవంతుణ్ణి యజ్ఞపురుషుడిగా చేసుకుని దాని వల్ల వచ్చిన ఫలితాన్ని ఆయనకే అర్పించాలనే కోరికతో (దదర్పణ బుద్ధిన్) యజ్ఞం చేశాను. ఎటువంటిదా యజ్ఞం? మానస యజ్ఞం – యజ్ఞానాం జపయజ్ఞోస్మి అని చెప్పుకున్నదే కదా? బ్రహ్మ ఇలా చేయడం చూసి మునులు, దేవదానవులు, మనుషులు మిగతావారందరూ కూడా ఇటువంటి యజ్ఞమే చేసారు.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS